## బాధతోనే మీడియాపై వ్యాఖ్యలు చేశా

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు
- వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన

మంచిర్యాల అర్బన్, జనవరి 8 : కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా సంబురాల సందర్భంగా మంగళవారం మంచిర్యాల ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తన శక్తి వంచన లేకుండా చేస్తున్నానని, ఇలా అనేక పనులు చేపడుతున్నప్పటికీ మీడియాలో కవరేజ్ తక్కువగా వస్తుందన్న బాధ తోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. మీడియాపై తనకు అపారమైన గౌరవం ఉందని, తను చేసే అభివృద్ధి, సంక్షేమానికి మీడియా వెన్నుదన్నుగా నిలువాలని అభిలాషిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.

## హెచ్ఎంపీవీ వైరస్‌పై అప్రమత్తంగా ఉండాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ

సీసీసీ నస్పూర్, జనవరి 8 : హ్యూమన్ మెటా న్యూమో వైరస్(హెచ్ఎంపీవీ)పై సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ సూచించారు. వైరస్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమాన్యం ముద్రించిన కరపత్రాలను శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో బుధవారం డీవైసీఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, వైద్యాధికారులతో కలిసి విడుదల చేశారు. చలి కాలంలో వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుందని, తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందన్నారు. అలాగే సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి వైరస్‌పై సింగరేణి పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించి, కరపత్రాలను అందజేశారు. ఎస్వోటూ జీఎం సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డాక్టర్లు దీప్తి, మనీష, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ ముత్తయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే లక్ష్యం

నస్పూర్, జనవరి 8 : మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ప్రజా భవన్ నుంచి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి కోసం వ్యాపార అంశాల్లో మహిళను ప్రోత్సహిస్తూ రుణ సదుపాయాలు కల్పించి, రాయితీ అవకాశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు వడ్డీ లేని రుణాలను పెద్ద ఎత్తున అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్‌ప్లాంట్లు ఏర్పాటు చేసి, వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు భవిష్యత్ కార్యాచరణ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ.. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం జిల్లాలో 10 ఎకరాల భూమిని గుర్తించామని, మిగతా భూమిని త్వరలోనే గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిషింగ్, అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు పాల్గొన్నారు.

## చైనా మాంజా అమ్మితే చర్యలు


ఆసిఫాబాద్ టౌన్ : దుకాణంలో తనిఖీ చేస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 8 : చైనా మాంజా ఎవరు అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు హెచ్చరించారు. చైనా మంజాల వల్ల ప్రమాదాలు జరుగుతాయని, విక్రయాలపై ప్రత్యేక డ్రైవ్ ఉంచామని తెలిపారు. పట్టణ సీఐ రవీందర్ పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీ చేశారు. ఎస్ఐ రాజేశ్వర్ తదితరులున్నారు.

దండేపల్లి, జనవరి 8 : చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని తాళ్లపేట రేంజర్ సుష్మారావు హెచ్చరించారు. తాళ్లపేట, ముత్యంపేటలోని కిరాణా దుకాణాల్లో అటవీశాఖ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఎఫ్ఎస్‌వో గోవింద్, ఎఫ్‌బీవో రహీముద్దీన్, నాగాచారి ఉన్నారు.

జన్నారం జనవరి 8 : మండల కేంద్రంలోని కిరాణా దుకాణాల్లో అటవీ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. చైనా మాంజా విక్రయించవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారులు భోజనాయక్, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీసీసీ నస్పూర్, జనవరి 8 : సింగరేణిలోని కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని 2022లో 18 రోజుల పాటు సమ్మెకు స్పందించిన యాజమాన్యం కార్మిక సంఘాలతో జరిగిన ఒప్పందాలను రెండేళ్లు గడిచినా అమలు చేయడంలేదన్నారు. పలు సమస్యలపై ఈ నెల 11న శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు తెలిపారు. నాయకులు తిరుపతి, వీరేశం, సాయిరాజు, అశోక్‌రెడ్డి, గుణిగంటి అశోక్, లక్ష్మణ్, పర్వతాలు, రాజు, కోమల తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ బౌద్ధ ధమ్మ ధ్వజ్ దివస్

వాంకిడి, జనవరి 8 : మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో 145వ ధమ్మ ధ్వజ్ దివస్ ఘనంగా నిర్వహించారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, మండలాధ్యక్షుడు జయరాం ఉప్రే, బౌద్ధ ఉపాసక్ పాండు జాడే, బుద్ధ భూమి వ్యవస్థాపక అధ్యక్షుడు గేడాం శిరీషన్, బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, బౌద్ధ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, రోషన్ ఉప్రే, దుర్గం శ్యామ్‌రావ్, దుర్గం సందీప్, దుర్గం డిలాజీ, దుర్గం మనోజ్, ఉప్రే బాల్వంత్, ఉప్రే రాజేశ్వర్, ఉప్రే ధర్మ, మహుల్కర్ అరుణ్, రమేశ్ జాడే, పగిడే బాబురావు, శివాజీ, తిరుపతి, ప్రదీప్, మహేశ్, తుకుడు, ప్రశాంత్, నారాయణ్, సురేశ్, లాహను తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

మందమర్రి, జనవరి 8 : బడీడు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి సబ్ డివిజన్ ఆపరేషన్ స్మైల్ ఏఎస్ఐ నూనె శ్రీనివాస్ హెచ్చరించారు. మందమర్రి మార్కెట్‌లోని పలు దుకాణాల్లో బుధవారం తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో పని చేస్తున్న వారి వివరాలు యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ స్మైల్ సిబ్బంది పాల్గొన్నారు.


దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న ఏఎస్ఐ శ్రీనివాస్

# మౌలిక వసతుల కల్పనకు చర్యలు


నంబాల ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

రెబ్బెన, జనవరి 8 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే పేర్కొన్నారు. రెబ్బెన మండలం నంబాల పంచాయతీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులు, పరిసరాలు, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు తాగునీరు, మూత్రశాలలు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై హెచ్ఎంను అడిగి తెసుకున్నారు. పాఠశాల ఆవరణలో బోరు మంజూరు చేయాలని గ్రామీణ నీటి సరఫర శాఖ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సంక్షేమంలో భాగంగా పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నూతన మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాని సూచించారు. పదోతరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో సోలార్ ప్లాంట్ భూమి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, హెచ్ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ**

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 8 : ప్రభుత్వ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరంలో వివిధ ఆంగ్ల మాధ్యమ గురుకులాల్లో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు https://tgcet. cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇందుకు జనన, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు వివరాలతో పాటు, ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ధ్రువీకరణ పత్రాల సత్వర జారీ కోసం కలెక్టరేట్‌లో సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# ఇంటి పన్ను కడితేనే ఆన్‌లైన్ చేస్తరట

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరిట ఒత్తిడి చేస్తున్నరు
- అధికారుల తీరుపై కొమ్మెర గ్రామస్తుల ఆగ్రహం


కొమ్మెరలో సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు

చెన్నూర్ రూరల్, జనవరి 8 : 'ఇందిరమ్మ ఇళ్ల సర్వే పేరుతో వచ్చి ఇంటి బకాయిలు చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నరు. ఇంటి బకాయిలు చెల్లించిన వారి వివరాలనే ముందుగా నమోదు చేస్తమంటున్నరు. అని మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామస్తులు మండిపడుతున్నరు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం సుమారు 400 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పంచాయతీ సెక్రటరీలు నమోదు చేస్తున్నారు. ఇక ఇదే అలుసుగా తీసుకొని ఇంటి పన్నులు చెల్లించాలని వేధిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పంచాయతీ సెక్రటరీ మౌనికను వివరణ కోరగా ఇంటి బకాయిలు చెల్లించాలని అధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని, అయినా ఇంటి బకాయిలు చెల్లిస్తే తప్పు ఏమిటని నిర్లక్ష్యపు సమాధానం చెప్పారు. అలాగే ఈ విషయమై కొమ్మెర మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కాళేశ్వరం రాజాజగౌడ్‌ను ప్రశ్నిస్తే ఇప్పుడు మాత్రం ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టాలని, లబ్ధిదారులను ఇంటి బకాయిల కోసం ఇబ్బందులు పెట్టవద్దని చెప్పానని ఆయన తెలిపారు. అయినా ఆమె వినకుండా ఇంటి బకాయిలు చెల్లించాలని కోరుతున్నట్లు తెలిసింది. చెన్నూర్ ఎంపీవో అజ్మత్ అలీని వివరణ కోరగా.. ఇంటి బకాయిలు వసూలు చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని, కానీ సర్వే పేరుతో గ్రామస్తులను ఇబ్బందులను గురిచేయద్దని ఆయన తెలిపారు. ఇంటి పన్నుల కోసం ఇబ్బందులకు గురి చేసినట్లు మా దృష్టికి వస్తే పంచాయతీ సెక్రటరీపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.. అనంతరం కొమ్మెర గ్రామంలో కొనసాగుతున్న సర్వేను మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు పరిశీలించారు.

# రెండు తలల పాము పట్టివేత

- ఏడుగురు నిందితుల అరెస్ట్.. రిమాండ్


చెన్నూర్ అటవీ శాఖ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎఫ్ఆర్వో శివకుమార్

చెన్నూర్ టౌన్, జనవరి 8 : రెండు తలల పాము తరలిస్తుండగా, పట్టుకొని ఏడుగురు నిందితులను అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేశారు. వారిని విచారణ నిమిత్తం కోర్టుకు తరలించారు. ఇందుకు సంబంధించి చెన్నూర్ పట్టణంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎఫ్ఆర్వో శివకుమార్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రెండు తలల పామును కారులో తరలిస్తుండగా. మహారాష్ట్రలోని కొప్పుల గ్రామానికి చెందిన సుదర్శన్ లస్మయ్య, ప్రభాకర్, తెలంగాణలోని బోరంపల్లికి చెందిన దుర్గం రాజగోపాల్, కొల్లూరుకు చెందిన కొర్లళ్ల సంతోష్, చెన్నూర్‌కు చెందిన వేములపల్లి తిరుపతి, శ్రీరాంపూర్‌కు చెందిన కుంభం పొచ్చిరెడ్డి, సర్వాయిపేటకు చెందిన కదార్ల ధనుంజయ్‌ని పట్టుకున్నట్లు తెలిపారు. మహారాష్ట్ర నుంచి తీసుకొస్తుండగా, పక్కా సమాచారంతో చెన్నూర్ మండలం చింతలపల్లి గ్రామం వద్ద పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వన్యప్రాణుల రక్షణ చట్టం (వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ ఆక్ట్)తో పాటు, పలు కేసుల్లో అరెస్టు చేసినట్లు, కోర్టులో హాజరుపర్చనున్నట్లు వివరించారు. పామును అడవిలో వదిలిపెట్టినట్లు, నిందితుల నుంచి ఒక కారు, బైకు స్వాధీనం చేసుకున్నటుల తెలిపారు. ఈ సమావేశంలో అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

కెరమెరి, జనవరి 8 : మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్ఐ గుంపుల విజయ్ అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో సెల్‌ఫోన్ ఆధారంగా నేరాలు పెరిగాయన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకొని కుటుంబ సభ్యులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండేలా సూచించాలని తెలిపారు. ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హాజీపూర్, జనవరి 8 : హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై ఎస్ఐ గోపతి సురేశ్ అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయరాదని, సోషల్ మీడియాలో ఇంటి వద్ద ఉద్యోగం చేసుకోవచ్చు అనే ప్రకటనలను నమ్మవద్దన్నారు.

సీసీసీ నస్పూర్, జనవరి 8 : నస్పూర్ సంఘమల్లయ్యపల్లెలో ప్రజలకు సైబర్ మోసాలపై సీసీసీ నస్పూర్ ఎస్ఐ నెల్కి సుగుణాకర్ అవగాహన కల్పించారు. చాలా మంది తెలిసి కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకొని మోసపోతున్నారన్నారు.

మందమర్రి రూరల్, జనవరి 8 : మండలంలోని అందుగులపేటలో గల సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో సైబర్ జాగృక్త దివాస్ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మందమర్రి అదనపు ఎస్ఐ మజీద్ ఖాన్, కళాశాల కరస్పాండెంట్ హీరాలాల్, ప్రిన్సిపాల్ సుష్మా రాజేశం, క్రైమ్ బ్రాంచ్ పోలీసులు బీ భారతి, మౌనిక, రజిని, నాగరాజు, సతీశ్, శ్రీధర్, హోంగార్డ్ శ్రావణ్ పాల్గొన్నారు.

వేమనపల్లి, జనవరి 8 : వేమనపల్లి మండల కేంద్రంలో నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ ఆధ్వర్యంలో సైబర్ జాగృక్త దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

వాంకిడి, జనవరి 8 : వాంకిడి జడ్పీఎస్ఎస్ పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్ఐ ప్రశాంత్ అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భీమారం, జనవరి 8 : మండల కేంద్రంలోని బాలుర వసతి గృహంలో విద్యార్థులకు సైబర్ అరెస్ట్‌ల పేరుతో జరుగుతున్న నేరాలపై ఎస్ఐ శ్వేత అవగాహన కల్పించారు. అలాగే నేరాలు జరిగే పద్ధతిని వివరించారు.

మంచిర్యాల అర్బన్, జనవరి 8 : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రజలకు సైబర్ మోసాలపై పట్టణ ఎస్ఐ వినీత అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ మోసానికి గుర్వైతే పోలీసులను గానీ, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930ను సంప్రదించాలని సూచించారు. బ్లూ కోల్ట్ సిబ్బంది రాజన్న, సత్యనారాయణ, నవీన్, భరత్, రవి, మహిళా కానిస్టేబుల్ మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

## విద్యాలయాల్లో డీఈవో సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

జన్నారం, జనవరి 8 : జన్నారం మండలం కొత్తపేట, ఇందన్‌పెల్లి యూపీఎస్, కిస్టాపూర్‌లోని కేజీబీవీని మంచిర్యాల డీఈవో యాదయ్య బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలల్లో భోజనం ఎలా ఉందని, బోధన ఎలా జరుగుతున్నదని అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదివి, ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఎంఈవో విజయ్ కుమార్, విద్యాలయ ప్రత్యేకాధికారి శ్రీవాణి, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

**11 నుంచి టీసీసీ పరీక్షలు**

నస్పూర్, జనవరి 8 : ఈ నెల 11 నుంచి 17 వరకు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ బాలుర, బాలికలు, గర్మిళ్ల ఉన్నత పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. డ్రాయింగ్ లోయర్, హైయర్ గ్రేడ్ పరీక్షలు 11,12,15,17 తేదీల్లో ఉదయం 10 నుంచి 12:30 వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను www.bse.telangana.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

## బోధన, భోజనంపై దృష్టి పెట్టాలి


ఇందాపూర్ పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

కెరమెరి, జనవరి 8 : విద్యార్థుల చదువుతో పాటు, వారికి అందించే భోజనంపైనా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ సూచించారు. కెరమెరి మండలంలోని ఇందాం ఎంపీయూపీఎస్ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనంతో పాటు, పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై జాగ్రత వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

## సొంతింటి పథకం అమలు చేయాలి

సీసీసీ నస్పూర్, జనవరి 8 : సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని తాము దశల వారీగా పోరాటాలు చేస్తున్నామని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. అసెంబ్లీ, గుర్తింపు ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేస్తామని హామీలు ఇచ్చి, ఇప్పుడు వాటి గురించే మాట్లాడడంలేదని ఆరోపించారు. ఈ పథకం సాధనకు అన్ని కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు నరహరి రావు, బాలాజీ, కస్తూరి చంద్రశేఖర్, శ్రీనివాస్, బానేశ్, సదానందం, ఇందూరి శ్రీనివాస్, విజయ్, సందీప్‌కుమార్, రాకేశ్, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


ఎజెండా చదివి వినిపిస్తున్న కార్యాలయ సిబ్బంది సాధిక్ అలీ

రామకృష్ణాపూర్, జనవరి 8 : క్యాతనపల్లి మున్సిపాల పాలకమండలి సాధారణ సమావేశం చైర్‌పర్సన్ జంగం కళ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఏడు అంశాలతో కూడిన ఎజెండాను సాదిక్ అలీ కౌన్సిల్ సభ్యులకు వినిపించారు. కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో కమిషనర్ గద్దె రాజు, వైస్ చైర్మన్ అర్రం విద్యాసాగర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్ డీ స్వామి, డీఈ డీ సుమతి, రెవెన్యూ అధికారి సతీశ్, ఏఈ అచ్యుత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

దండేపల్లి, జనవరి 8 : రాష్ట్రస్థాయి బయో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో దండేపల్లి మండలం గుడిరేవు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి గంగాధరి అంజి ప్రథమ స్థానం సాధించాడు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని హెచ్ఎం మల్లూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు. టాలెంట్ టెస్ట్‌కు ఎంపికవడంలో కీలకపాత్ర పోషించిన గైడ్ టీచర్ సల్మాను సన్మానించారు.

**రాష్ట్రస్థాయి కరాటేలో..**

తాండూర్, జనవరి 8 : రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మండల కేంద్రంలోని విద్యాభారతి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తైక్వాండో సెక్రటరీ, కరాటే మాస్టర్ బోగే రాజేశ్ తెలిపారు. సోమగూడెంలో 5వ తేదీన జరిగిన 5వ రాష్ట్రస్థాయి ఓపెన్ టూ ఆల్ స్టైల్ కరాటే కుంగ్ ఫూ చాంపియన్‌షిప్‌లో స్పారింగ్ విభాగంలో శివచరణ్‌చారి(సిల్వర్), ద్వారకావర్మ(బ్రాంజ్), రణదీప్‌సింగ్ (బ్రాంజ్), మోక్షిత్ (సిల్వర్), నందిత (సిల్వర్), హైందవి (సిల్వర్), కటాస్ విభాగంలో సాయిపవన్ (బ్రాంజ్) పతకాలు సాధించారని పేర్కొనారు. వీరిని పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్, ప్రిన్సిపాల్ సరోజిని, తైక్వాండో ప్రెసిడెంట్ సిద్ధమల్ల చిరంజీవి, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

**ఉషూ పోటీల్లో..**

కాగజ్‌నగర్, జనవరి 8 : హైదరాబాద్‌లో గత నెల 27 నుంచి 31 వరకు నిర్వహించిన సీఎం కప్ ఉషూ పోటీల్లో కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన క్రిష్ కుమార్ ప్రతిభ చూపాడు. సీనియర్ విభాగంలో కాంస్య పతకం సాధించగా, ఎమ్మెల్యే హరీశ్ బాబు, కోచ్ దేవయ్య, పీడీలు శివకుమార్, రవి, ఆర్మీ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, తదితరులు అభినందించారు.

## విద్యార్థులకు బ్లాంకెట్ల పంపిణీ

నస్పూర్, జనవరి 8 : మంచిర్యాల పట్టణంలోని చున్నం బట్టీవాడలో గల వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖలు అందించిన 144 బ్లాంకెట్లను బుధవారం కలెక్టర్ కుమార్ దీపక్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.

## రేపు మండలస్థాయి క్రికెట్ టోర్నీ

తాండూర్, జనవరి 7 : సంక్రాంతి సందర్భంగా మాదారం టౌన్‌షిప్‌లోని లాల్ బహుదూర్ స్టేడియంలో శుక్రవారం తాండూర్ మండలస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు మాదారం క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) నిర్వాహకులు, యూత్ సభ్యులు తెలిపారు. మండలంలోని క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు డ్రా ఉంటుందని వెల్లడించారు. ఎంట్రీ ఫీజు రూ. 1100గా నిర్ణయించినట్లు, ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. నిర్వాహకులు సాగర్ 80084 70147, అఖిల్ 75699 44578 నంబర్లను సంప్రదించాలని కోరారు.

## గెస్ట్ టీచర్ పోస్టులకు దరఖాస్తులు

పెంచికల్‌పేట్, జనవరి 8 : మండలంలో కేజీబీవీలో ఖాళీగా ఉన్న గెస్ట్ పీఈటీ, హిందీ, గణితం పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రత్యేకాధికారి కవిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మహిళ అయి ఉండాలని, పీఈటీకి డిగ్రీ, బీ పీఎడ్, గణితం బోధించేందుకు డిగ్రీ బీఈడీ ఉత్తీర్ణత, హిందీకి ఎంఏ హిందీ, హెచ్‌పీటీ, టెట్‌అర్హత గలవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గలవారు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో 10వ తేదీలోగా కేజీబీవీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్/భీమారం, జనవరి 8 : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా యూనియన్ గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య, అధ్యక్షుడు నక్క రాజన్న డీఆర్డీవో కిషన్‌కు వినతి పత్రం అందించారు. 19 ఏళ్లుగా పనిచేస్తున్నా వేతనాలు పెంచడం లేదని పేర్కొన్నారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య, ఉపాధ్యక్షుడు రేగుంట సతీశ్, ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు భూమా, రజిని, శ్రీనివాస్, శంకరయ్య, సుదర్శన్‌గౌడ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం పట్టివేత

భీమారం, జనవరి 8 : ఆరెపల్లి గ్రామంలోని రేషన్ షాపులో ప్రజలకు పంపిణీ చేయకుండా అక్రమంగా తరలించేందుకు ఉంచిన 11 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం రాత్రి పట్టుకున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ డీటీ స్రవంతి తెలిపారు. పక్కా సమాచారం మేరకు తనిఖీ చేసి పట్టుకున్నట్లు, డీలర్ భాస్కర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆ బియ్యాన్ని పోలంపల్లి రేషన్ డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

## నేడు శిక్షకుల ఎంపికకు ఇంటర్వ్యూ

రెబ్బెన, జనవరి 8 : సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వృత్తి కోర్సుల (యోగా, డీటీపీ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితరాలు) శిక్షకుల కోసం గురువారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గోలేటిలోని జీఎం కార్యాలయంలో గల కాన్ఫరెన్స్‌హాల్‌లో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

## మొరం తరలింపు అడ్డగింత

కాసిపేట, జనవరి 7 : కాసిపేట మండలం రొట్టెపల్లి శివారులోని గుట్టను జేసీబీతో తవ్వి ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా మట్టిని తరలిస్తుండగా, బుధవారం స్థానిక ఆదివాసులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా తరలించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మానుకోవాలని, లేకపోతే ఆందోళన బాట పడుతామని స్పష్టం చేశారు. తుడుందెబ్బ జిల్లా గౌరవాధ్యక్షుడు పెంద్రం హన్మంతు, పటేళ్లు కోవ గణపతి, ఆడె జంగు, గ్రామస్తులు కుర్సింగ తిరుపతి, చిక్రం రాందాస్ ఉన్నారు.

## ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

జన్నారం, జనవరి 8 : మండలంలోని చింతగూడ జీపీ పరిధి పాపమ్మగూడ వద్ద గల సర్వేనంబర్ 18/1లోని ప్రభుత్వ భూమి (20 ఎకరాలు)లో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐఎంల్(ప్రజాపంథా) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఐఎంల్(ప్రజాపంథా) జిల్లా కమిటీ సభ్యులు పురంశెట్టి బాపు, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి రమాదేవి, జిల్లా అధ్యక్షుడు సికిందర్, గ్రామస్తులు ఉన్నారు.

## వరిలో కాలిబాటలతో తెగుళ్ల నివారణ

మందమర్రి రూరల్, జనవరి 8 : వరి పొలం మడుల్లో తూర్పు, పడమర దిశలుగా కాలిబాటలు ఏర్పాటు చేస్తే తెగుళ్ల బారిన పడకుండా అధిక దిగుబడులు వచ్చే అవకాశం ఉందని చెన్నూర్ ఏడీఏ భానుప్రసాద్ పేర్కొన్నారు. పులిమడుగులో బుధవారం వరి పంటను మండల వ్యవసాయాధికారి కిరణ్మయితో కలిసి పరిశీలించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ముత్యం తిరుపతి, కనకరాజు, మహిళా రైతులు ఉన్నారు.